ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన 11వ ఎస్ఐపిబి, లక్షా 14 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది.
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఈరోజు భారీ పేలుడు సంభవించింది.
- మహిళల వన్డే ప్రపంచ కప్ లో భాగంగా భారత్ దక్షిణాఫ్రికా జట్ల మధ్య విశాఖపట్నం వేదికగా రేపు క్రికెట్ మ్యాచ్ జరగనుంది.
- ఉత్తరాంధ్రలోని పలు జిల్లాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 11వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డ్ (SIPB) సమావేశం అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా లక్షా 14 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టూరిజం, ఎరోస్పేస్, ఇంధనం, ఆహార శుద్ధి రంగాలకు సంబంధించిన 30కిపైగా ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో భాగంగా రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రైడెన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్ కు సైతం (RAIDEN INFO TECH DATA CENTER) ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని, గడిచిన 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు.

====================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఈరోజు భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి షెడ్ గోడ కూలడంతో పాటు చెలరేగిన మంటల్లో చిక్కుకొని ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందగా.. మరికొంతమంది గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సహాయం తదితర విషయాలపై అధికారులను

అడిగి తెలుసుకున్నారు. స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

అదే విధంగా.. ఈ అగ్ని ప్రమాదంపై రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించాలని గవర్నర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

====================

రాష్ట్రంలో రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం 1000 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. మొత్తం 274 రహదారుల మరమ్మతుల కోసం ఈ నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు పాలనాపరమైన అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రహదారులకు సంబంధించిన 108 పనులకు రూ.400 కోట్లు, జిల్లా రహదారులకు సంబంధించిన 166 పనులకు రూ.600 కోట్ల రూపాయలను మంజూరు చేశారు.

====================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లాలో రేపు పర్యటించనున్నారు. రేపు ఉదయం 10 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో మత్స్యకార ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యలపై చర్చిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

====================

అంతరిక్ష రంగంపై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఇస్రో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోందని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరక్టర్ ఈ.ఎస్.పద్మకుమార్ తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఈరోజు ఒంగోలు నగరంలో షార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నేటి యువత సైన్స్, మ్యాథ్స్, స్పేస్ వంటి వివిధ రంగాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు, యువతకు ఇంటర్న్ షిప్ వంటి ఎన్నో అవకాశాలను షార్ కల్పిస్తోందని ఆయన తెలిపారు.

====================

“స్వచ్ఛతా హీ సేవ-2025" ప్రచార కార్యక్రమం అనకాపల్లి పట్టణంలోని శ్రీ గౌరీ గ్రంథాలయంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC) విశాఖపట్నం క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో ఈరోజు జరిగింది. "స్వచ్ఛోత్సవ్" ఇతివృత్తం ప్రధానాంశంగా నిర్వహించిన ఈ కార్యక్రమం జీరో-వేస్ట్ పద్ధతిన... సామూహిక పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛ భారత్ మిషన్‌ను మరింత ముందుకు తీసుకెళ్లింది. ఈ సందర్భంగా శ్రీ గౌరీ గ్రంథాలయం పోషకులు, పాఠకులను ఉద్దేశించి CBC డైరెక్టర్ పి. రత్నాకర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఒక ప్రచారంగానే కాకుండా పరిశుభ్రమైన,

పచ్చని భారతదేశం కోసం ఒక ప్రతిజ్ఞలా తీసుకోవాలని చెప్పారు. ఇటువంటి చిన్న చిన్న కార్యక్రమాలు సైతం స్వచ్ఛ భారత్ లాంటి విస్తృత దృక్పథం వైపు దేశాన్ని నడిపిస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి పాఠకుల కోసం గ్రంథాలయ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. పుస్తక పఠనం లాగే శుభ్రమైన పరిసరాలు కూడా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, విశాఖపట్నం క్షేత్ర కార్యాలయం అధికారి శ్రీరామమూర్తి కందాళ స్వచ్ఛత ప్రతిజ్ఞను గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులతో చేయించారు.

=====================

విరామం

=====================

పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పోషన్ అభియాన్ మాసోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా తణుకు మండలం పైడిపర్రు గ్రామంలో అంగన్వాడి కేంద్రాలు నిర్వహించిన అవగాహన సదస్సులో మహిళలు, గర్భిణీలు, బాలింతలు, బాలికలకు ఆరోగ్య సంరక్షణపై వైద్యులు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడి ఐసిడిఎస్ సూపర్వైజర్ మహాలక్ష్మి ఆకాశవాణితో మాట్లాడుతూ.. అక్టోబరు 16వరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గర్భిణీలకు మందులు ఉచితంగా అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె వెల్లడిస్తూ...

(వాయిస్... 22 సెకన్లు)

=====================

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలంలోని హనుమంతుపాలెం గ్రామంలో 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, గ్రామస్తులకు జీఎస్టీ వస్తు సేవల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతీ రూపాయి ఆదాయాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జీఎస్టీ ద్వారా సమకూరుతున్న ఆదాయాన్ని ప్రజల సంక్షేమానికి ఖర్చు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

=====================

ఆదికర్మయోగి అభియాన్ తో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అల్లూరి సీతారామరాజు జిల్లా సహాయ కలెక్టర్ సాహిత్ తెలిపారు. హుకుంపేట మండలం సంపంగి పుట్టు గ్రామంలో నిర్వహించిన ఆది కర్మయోగి అభియాన్ గ్రామ సభలో సహాయ కలెక్టర్ ముఖ్యఅతిథిగా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆది కర్మయోగి అభియాన్ ద్వారా గిరిజనాభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమ ఫలాలు చిట్టచివరి గిరిజన గ్రామాల వరకు చేరాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన ఆశయమని చెప్పారు. గిరిజనుల అవసరాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, త్రాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, విద్యుత్, వంటి మౌలిక సదుపాయాలతో పాటు గృహాలు, పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, మొదలగు అంశాలతో గ్రామాల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందన్నారు.

====================

మహిళల వన్డే ప్రపంచ కప్ లో భాగంగా భారత్ దక్షిణాఫ్రికా జట్ల మధ్య రేపు విశాఖపట్నం వేదికగా మ్యాచ్ జరగనుంది. రేపు మధ్యాహ్నం 3 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఇప్పటికే జరిగిన తొలి రెండు మ్యాచులలో విజయం సాధించి, భారత్ పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో కొనసాగుతోంది. మరో రెండు మ్యాచ్ లలో విజయం సాధించినట్లయితే దాదాపు సెమీఫైనల్స్ కు చేరుకుంటుంది.

====================

దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి మన్నార్ గల్ఫ్ వరకు తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల మీదుగా సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రేపటి వర్ష సూచనలను వాతావరణ శాఖాధికారి ఎం. వెంకటరావు వెల్లడిస్తూ...

(వాయిస్... 27 సెకన్లు)

అదే విధంగా.. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కావున ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

====================

====================